క్లుప్తంగా

నూకాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం



దాత కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న రాజాన సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కల్యాణ కళావేదిక వద్ద ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకం, మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి రమేష్ బాబు, త్రిపుర సుందరి దంపతులు, హరికృష్ణ, లలిత దంపతులు, భాను ప్రకాష్, కావ్య సుధ కుటుంబ సభ్యులు రూ. 25,116 అమ్మ వారికి విరాళంగా అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో అమ్మ వారి శేష వస్త్రాన్ని అందించి, చిత్ర పటాన్ని ఇచ్చి వేద ఆశీర్వాదంతో ఘనంగా సత్కరించారు. జూన్ 3న ఆలయంలో చండీహోమం నిర్వహిస్తామని భక్తులు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని, అక్రమ మార్గంలో మస్తర్లు వేసి డబ్బులను దోచుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎం.జీవరత్నం అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, పి.రామకృష్ణ పాల్గొని ఉపాధి హామీ సమస్యలపై గ్రామాల వారీగా చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రతిష్టంగా అమలు చేయడంలో జంగారెడ్డిగూడెం ఎంపీడీవో, ఏపీఓ విఫలమయ్యారన్నారు. నాగులగూడెంలో ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమంగా మస్తర్లు వేసి ఉపాధి నిధులు స్వాహా చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. శ్రీనివాసపురం, అక్కంపేట, చక్రదేవరపల్లి, నిమ్మలగూడెం, పేరంపేటలో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమ మార్గంలో మస్తర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. తామా ముత్యాలమ్మ, తుమ్మల సత్యనారాయణ, రాజమండ్రి దానియేలు, గుడెల్లి వెంకటరావు, ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

'శ్రీవీరప్రతాప్ 1940' సినిమా చిత్రీకరణ



టి.నరసాపురంలో శ్రీ వీరప్రతాప్ 1940 చిత్రం షూటింగ్

టి.నరసాపురం: మండలంలోని పలు గ్రామాల్లో 15 రోజులుగా సినిమా షూటింగ్ కొనసాగడంతో సందడి నెలకొంది. మండలంలోని మక్కినవారిగూడెం, బండివారిగూడెం, లంకాలపల్లి, కృష్ణాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం వేల్పుల నాగేశ్వరరావు దర్శకత్వంలో శ్రీ వీరప్రతాప్ 1940 చిత్రం షూటింగ్ నిర్వహించారు. రాజీ రవీంద్ర హీరోగా, చరిష్మా (తొలి పరిచయం) హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్‌వీపీకేహెచ్‌జీ కృష్ణంరాజు నిర్మాత. రాజుల చరిత్రను ఇతివృత్తంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు వివరించారు. ఈ ప్రాంతంలో ఈ చిత్రం షూటింగ్ శనివారంతో ముగుస్తుందని ఆయన తెలిపారు.

అన్న ప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వాసవీ మాత ఆలయంలో అన్నప్రసాద వితరణ శుక్రవారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఆలయంలో అన్నప్రసాద వితరణ చేస్తున్నామన్నారు. శుక్ర వారం న్యూ మాడా రత్నం క్లాత్ అండ్ రెడీ మేడ్స్, దాక్షాయణి పెట్రోల్ బంక్ యజమాని మాడా శ్రీనివాస్, శాంతకుమారి దంపతుల కుమారుడు సాయిరత్న హితేష్, కుమార్తె సుప్రజ్ఞ సహకారంతో అన్నదానం చేసినట్టు తెలిపారు. సాయంత్రం వందనపు కృష్ణకుమారి ఆధ్వర్యంలో మహిళలతో సామూహిక లలితా సహస్రపారాయణం, శివలింగాష్టకం నిర్వహించారు.

ఎరువుల నిల్వల పరిశీలన

పోలవరం రూరల్: సొసైటీల్లో ఎరువుల నిల్వలను సొసైటీ ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి ఆర్. గంగాధర్ పరిశీలించారు. శుక్రవారం ఆయన మండలంలోని కొత్తపట్టిసీమ, కృష్ణారావుపేట సొసైటీల్లో ఎరువులను తనిఖీ చేశారు. జీఎస్టీ, ఎరువుల లైసెన్సులకు సంబంధించి మధ్య వ్యత్యాసాలను గుర్తించి సరిచేసుకోవాలని తెలియజేశారు.స్టాక్ రిజిస్టర్లను గోడౌన్లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు, అధ్యక్షులు బండారు అప్పారావు, సెక్రటరీ కె.రాంబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పుస్తక పఠనం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప, పాఠకులు పాల్గొన్నారు.

వలంటీర్ల కృషి అభినందనీయం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించడంలో వలంటీర్ల కృషి అభినందనీయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ వార్డుల్లో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు సేవావజ్రం, సేవామిత్ర, సేవారత్నం అవార్డులను అందించి శాలువాలతో సత్కరించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా మరింత సమర్థవంతంగా పని చేయాలని కోరారు. అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా



జీలుగుమిల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

నిలుస్తుందని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థను అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలని చూస్తుంటే చంద్రబాబు నాయుడు మాత్రం వలంటీర్ల వ్యవస్థపై హేళనగా మాట్లాడటం సరికాదన్నారు. వలంటీర్లు, సచివాయ సిబ్బంది స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్స పోచమ్మ, సర్పంచ్ సిర్రి జగదాంబ, పార్టీ మండల కన్వీనర్ గూడవల్లి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాస రెడ్డి, గంటశాల గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ వనమా రామకృష్ణ, ఎంపీటీసీలు మొడియం వెంకట లక్ష్మీ, సున్నం సురేష్, సర్పంచ్‌లు సున్నం వరలక్ష్మి, కోర్స వెంకటలక్ష్మీ, పైదా ముత్యాలమ్మ, నాయకులు చందా ప్రసాద్, చిట్టిబొమ్మ శ్రీను, కక్కిరాల రాము, కొప్పుల సత్యనారాయణ, వీరంకీ వెంకటేశ్వరరావు, కుంజా రాముడు, సూరిశెట్టి యేసు, మంగతాయారు, ఎలక్ట్రికల్ డీఈ అంబేడ్కర్, ఇన్‌చార్జి తహసీల్దార్ సందీప్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో చరిత్ర సృష్టించిన సీఎం జగన్

బుట్టాయగూడెం: గడచిన నాలుగేళ్లగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన చూస్తూ సంక్షేమంలో చరిత్ర సృష్టించి, ప్రజల్లో చెరగని ముద్ర వేశారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. బుట్టాయగూడెం లక్ష్మడుగూడెం చెందిన పిచ్చుకల వెంకటేశ్వరరావుకు చెందిన ఎద్దు ఇటీవల పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీనిపై స్థానిక నాయకులు కలగర నాని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, విద్యుత్‌శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనితో బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి రూ. 70,000 సహాయంగా మంజురయ్యాయి. ఈ నిధుల చెక్కును రైతుకు మండలంలోని దుద్దుకూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజల స్థితిగతులను మార్చేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనుపోజు మురళి, సలీమ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లకు అరుదైన గౌరవం



వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: ఉన్నతాధికారులకు సైతం దక్కని అరుదైన గౌరవం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వలంటీర్లకు మాత్రమే దక్కిందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వలంటీర్లను సన్మానించి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని అన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సమన్వయ కృషి కారణంగా పథకాలు సక్రమంగా అర్హులందరికీ అందుతున్నాయన్నారు. వలంటీర్లు మరింత ఉత్సాహంగా పనిచేసి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని, వ్యవస్థను కాపాడుకోవాలని సూచించారు. నవరత్న పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా 3లక్షల ఎకరాలకు గిరిజనులకు హక్కు కల్పించారన్నారు. వలంటీర్లు, గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పేదలకు పట్టాలిస్తుంటే వారికిచ్చే భూములను శ్మశానంతో పోల్చుతున్న దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్‌బాబు, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు, రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు, సహకార సంఘం చైర్మన్ దేవరపల్లి ముత్తయ్య, పామాయిల్ రైతు ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ దివ్యభారతి, ఎంపీటీసీ బండి సుబ్బారావు, నార్లపాటి వెంకట్రావు, సచివాలయాల కన్వీనర్ ఉమ్మడి తేజ, సర్పంచ్ సునంద, పార్టీ మండల నాయకులు దాసరి రాంబాబు, బొంతు అంజిబాబు, దాకారపు సూరిబాబు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం అభివృద్ధిలో రోటరీ క్లబ్ కీలక పాత్ర



కొయ్యలగూడెం రోటరీ ఫంక్షన్ హాల్‌లో గవర్నర్ భాస్కరరామ్‌ను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం అభివృద్ధిలో రోటరీ క్లబ్ కీలక పాత్ర పోషిస్తుందని 25 ఏళ్లలో క్లబ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలు, ప్రజోపయోగ నిర్మాణాలే అందుకు సాక్ష్యం అని రోటరీ క్లబ్-3020 గవర్నర్ ఏకేఎస్ భాస్కరరామ్ పేర్కొన్నారు. శుక్రవారం గవర్నర్ హోదాలో కొయ్యలగూడెంలో జనరల్ విజిట్‌లో భాగంగా ఆయన పలుచోట్ల పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి త్వరితగతిన ఆలయ నిర్మాణం పూర్తి చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న కంకర కోనేరు (రజకుల చెరువు) అభివృద్ధికి సంబంధించిన శిలాఫలక స్థూపాన్ని అధ్యక్ష కార్యదర్శులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, శంకు కొండలతో కలిసి ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ ద్వారా సుమారు రూ.24 లక్షలు స్థానిక దాతల ద్వారా సుమారు మరో రూ.25 లక్షలు విరాళం ద్వారా కోనేరు నలువైపులా వాకర్స్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైతే క్లబ్ ద్వారా ఎన్నారైల సహకారంతో మరో రూ.10 లక్షల విరాళం ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. 40 రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. కొయ్యలగూడెం మండల అభివృద్ధికి కృషి చేస్తానని భాస్కరరామ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను క్లబ్ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ముద్దు గోపి, మాజీ అధ్యక్షుడు మజ్జి సూరిబాబు, ఎస్‌బీజీ శేఖర్, బోనగిరి పాపారావు, తోట వెంకటేశ్వరరావు, ఎస్‌కే అమీర్ భాష, జి.మోహన్‌రావ్, గొలిశెట్టి వాసు, యాతం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో కల్వర్టు పనులు పూర్తి



చింతలపూడి, కాంతంపాలెం గ్రామాల మధ్య శిథిలావస్థలో కల్వర్టు (నాడు)



ఎంపీ నిధులతో విశాలంగా నిర్మించిన కల్వర్టు (నేడు)

చింతలపూడి : చింతలపూడి నుంచి కాంతంపాలెం వెళ్లే రహదారిలో పానకాల చెరువుపై నిర్మిస్తున్న కల్వర్టు పనులు పూర్తయ్యాయి. కల్వర్టు నిర్మాణానికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సుమారు రూ.58 లక్షల నిధులను మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంత వాసుల దశాబ్దాల కల నెరవేరింది. గతంలో ఈ కల్వర్టు ఉన్న ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. దీంతో గ్రామస్తులు కల్వర్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎంపీని కోరడంతో ఆయన తన పార్లమెంట్ అభివృద్ధి నిధుల నుంచి నిధులు మంజూరు చేశారు. కల్వర్టు నిర్మాణం పూర్తి కావడంతో నిలిచిపోయిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

లింగపాలెంలో సీఎస్ఐ చర్చి ప్రారంభం

లింగపాలెం: దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా సమాజంలో రుగ్మతలను రూపుమాపటానికి దోహదపడుతాయని లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, వైసీపీ నేత బీవీఎస్ రెడ్డి అన్నారు. శుక్రవారం లింగపాలెంలో గ్రామస్తులు, సంఘస్తులు, విశ్వాసులు సహాయంతో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చిను వారు ప్రారంభోత్సవం చేశారు. పాస్టర్ ఆనంద్ శామ్యూల్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చి నిర్మాణానికి మైత్రి డవలపర్స్ అధినేత, వైసీపీ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు.సంఘ సభ్యులు, విశ్వాసులు, పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

లింగపాలెం: భూవివాదాలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం ద్వారా భూముల రీసర్వే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు వైఎస్సార్ సీపీ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్‌రెడ్డి) తెలిపారు. లింగపాలెంలో శుక్రవారం డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈమేరకు బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఈసర్వేను పూర్తిగా ఆధునిక పద్ధతుల్లో డ్రోన్లను వినియోగించి నిర్వహిస్తోందన్నారు. సర్వే అనంతరం సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో భవిష్యత్తులో ఎటువంటి భూవివాదాలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో రికార్డుల రూపొందుతాయన్నారు. సర్పంచ్ తగరం హేమలత, మాజీ జెడ్పీటీసీ కట్టా సత్యనారాయణ, ఎంపీటీసీ బి స్వరూప, మండల సేవాదళ్ అధ్యక్షుడు రెడ్డి బాబ్జి, వైసీపీ నాయకులు బి ప్రభాకరెడ్డి, సీహెచ్ సత్యనారాయణరెడ్డి, శ్రీనువాసరెడ్డి, శావా రాజేష్, కార్యదర్శి పి సుగుణరావు, సర్వేర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో నిర్మిస్తున్న జగనన్న గృహ నిర్మాణాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకునేలా చూడాలని కలెక్టర్ సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ, గృహాలు మంజూరు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకి భూములు అందించిన రైతులు కొందరు కలెక్టర్‌ను కలిసి తమ భూములకు సంబంధించి తక్కువ నష్టపరిహారం అందించారని, సవరించిన పరిహారం అందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఝాన్సీరాణిని ఆదేశించారు. సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, స్లీవజోజి. ఎంపీడీవో కె. కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు పోల్నాటి రాజా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో కలెక్టర్ పర్యటన

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ పరిధిలో రోడ్లకు మరమ్మతులు చేయించాలని, సంపూర్ణ పారిశుధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం అధికారులతో కలిసి కలెక్టర్ సుడిగాలి పర్యటన చేసి పౌర సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుమల పారిజాతగిరి వద్ద పార్క్ అభివృద్ధి చేయాలని, పట్టణ ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని, పట్టణంలో రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని మునిసిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆ ప్రాంతంలోని ప్రజలు కలెక్టర్‌ను కలిసి పారిజాతగిరి గిరిప్రదక్షిణ దారిలో ఆక్రమణలను తొలగించాలని కోరారు. వెంటనే ఆక్రమణలు తొలగించి అనువైన దారిని ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం శ్రీనివాసపురం జగనన్న లేఔట్‌ను పరిశీలించి, ఇళ్ల నిర్మాణ ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేకి భూములు అందించిన రైతులు కొందరు కలెక్టర్‌ను కలిసి తమ భూములకు తక్కువ నష్టపరిహారం అందించారని, సవరించిన నష్టపరిహారం అందించాలని కోరగా, వెంటనే పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ కె.ఝాన్సీరాణి, మునిసిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో తదతరులు పాల్గొన్నారు.

30న చింతలపూడిలో మెగా జాబ్ మేళా



నగర పంచాయతీ కార్యాలయంలో జాబ్ మేళాపై వార్డు సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చింతలపూడి: ఈనెల 30న స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు సచివాలయ సిబ్బందికి జాబ్ మేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాబ్ ఫెయిర్‌లో 18 కంపెనీల ప్రతినిధులు నేరుగా పాల్గొని రెండు వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ విద్యార్హతలు ఉండి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సున్న నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డీఎస్‌డీఓ ఈ తమ్మాజీరావు, పీఓలు ప్రవీణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

మండల యూత్ అధ్యక్షుడు కన్నం సర్వేశ్వరరావు

టి.నరసాపురం: పార్టీ అభివృద్ధి కోసం కృషిచేసిన వ్యక్తులకు తగిన గుర్తింపు లభిస్తుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కష్టపడి పార్టీ విజయానికి కృషిచేసిన టి.నరసాపురానికి చెందిన కన్నం సర్వేశ్వరరావును టి.నరసాపురం మండల వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే బాలరాజు వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ప్రకటించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావును దుశ్శాలువాతో బాలరాజు సన్మానించారు. ఈ పదవికి తనను ఎంపిక చేసిన ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆళ్ల నాని, మండలంలోని ప్రజా ప్రతినిధులకు సర్వేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత భూముల్లో పంటలు పండించాలి

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పంపిణీ చేసిన భూముల్లో పంటలు పండించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ పీఓ ఛాంబర్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పంపిణీ చేసిన వ్యవసాయ భూముల్లో ఎత్తుపల్లాలను సరిచేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ ప్రఫుల్ కుమార్‌ను ఆదేశించారు. సాగు చేపట్టిన వారికి రైతు భరోసా పథకం, క్రాప్ లోన్ మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ బుచ్చిబాబును ఆదేశించారు. ఏపీఓ పీవీఎన్ నాయుడు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎలక్ట్రికల్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి: చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, 4 అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు పీఓ పి మాధవి శుక్రవారం తెలిపారు. పంతంగులగూడెంలో కార్యకర్త పోస్టుకు (ఓసీ మహిళ), చింతలపూడి మండలం పోతునూరులో సహాయకురాలు (బీసీ డీ), సీతానగరం-2 (ఎస్సీ), లింగపాలెం మండలం సుందర్రావుపేటలో (ఓసి), టి నరసాపురం మండలం తెడ్లెం-2కేంద్రంలో (బీసీ ఎ) కేటగిరి మహిళలు దరఖాస్తులు ఐసీడీఎస్ కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు

దరఖాస్తులు ఆహ్వానం

ద్వారకాతిరుమల: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి తెలిపారు. దేవినేనివారిగూడెం, ద్వారకానగర్, జి.కొత్తపల్లి గ్రామాల్లోని పోస్టులను ఓ.సి కేటగిరి, రామన్నగూడెంలోని పోస్టును ఓ.సి దివ్యాంగురాలికి కేటాయించినట్టు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు జూన్ 2 సాయంత్రం 5 గంటలలోపు భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టులో, ఏలూరు జిల్లా కార్యాలయంలో స్వయంగా దరఖాస్తులను అందించాలని కోరారు.